


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

## -164-

**(24 జూలై 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**దేశంలో బీదవారి** సంగతి ఎలావున్నా వారి ఇళ్ళల్లో విందులు జరుగుతూనే వున్నాయి. ఘరానా పద్ధతి అవలంబించి పేరు సంపాదించాలని కామందులు ప్రయత్నాలు చేస్తూనే వున్నారు.

పంచభక్ష్య పరమాన్నాలతో భోజనాలు పెట్టడం మనకు సాంప్రదాయమే. పెళ్ళి సమయాలు వగైరాలలో బంధుమిత్ర సమేతంగా విచ్చేసి, షడ్రసోపేతంగా విందులు ఆరగించి మమ్మానందింపచేస్తూ వుండేవారు.

ఆరోజుల్లో ఆహ్వానాలంటే కార్డులు కొట్టి, చీట్లు అంటించో మరిచిపోయే పోస్టులో పారేసి వూరుకోవడం కాదు.

బంధువులైనవారందరినీ స్వయంగా వెళ్ళి ఆహ్వానిస్తేనే వారు వచ్చేవారు. ఎవరైనా ఏ కారణం చేతనైనా రాలేకపోతే వారిమీద ఆగ్రహం పూనేవారు. వారి ఇళ్ళల్లో జరిగే శుభకార్యాలకు కావాలని గైర్ హాజర్ అయ్యేవారు.

నా చిన్నతనంలో ఒకరింట్లో ఏదో శుభకార్యమైతే పిలిచి రమ్మని ఒక కుర్రవాణ్ణి పంపారు. అతడు ఎంతో ఆత్రుతతో అందరినీ ఆహ్వానించాడు.

"మీ నాన్నగారు రాలేదేం?" అని ప్రశ్నించారు.

ఆయన ఫలానా ఫలానా ఊర్లు వెళ్ళారని చెప్పాడు కుర్రవాడు.

అక్కడితో ఇవతల వాళ్ళకు కోపం వచ్చింది. తమర్ని ఆ కుర్రవాడిచేత పిలిపించడంలోగల తాత్పర్యం – చిన్న బుచ్చడం తప్ప మరొకటి కాదని నిర్ణయించారు. ఆ శుభ కార్యానికి వెళ్ళకూడదని నిశ్చయించుకున్నారు.

అక్కడగల ఒక ముసలాయన తన అభిప్రాయాన్నిలా వెలిబుచ్చాడు. "పోనీ కుర్రవాడికి మైనారిటీ అయినా వెళ్ళి వున్నట్లయితే తప్పకుండా వెళ్ళవచ్చు. ఇంకా ఏడాదికిగాని అతగాడు మేజర్ కాదు. అలాటివాడిచేత పిలిపించడం మర్యాదకు భంగమే" అన్నాడుట. అందరూ ఆమోదించారు. ఆ శుభకార్యాన్ని తిరస్కరించారు.

ఆ రోజుల్లో పట్టుదలలు అంతగా వుండేవి. ఇప్పుడన్నీ పోస్టల్ ఆహ్వానాలే. అవి అందకపోతే అడిగేవారే లేరు. ఒకరింట్లో అలాగే శుభలేఖ అందలేదన్నారు. పెళ్ళివారు వేశామన్నారు. కనీసం సర్టిఫికెట్ ఆఫ్ పోస్టింగ్ అన్నావుంటే అంగీకరించే వాళ్ళం. అదీలేదు. మీకు తగినంత సఖ్యత లేదు. బలం లేదు పొమ్మన్నారు.

ఏదో ఆచారం ప్రకారం పిలుస్తున్నారుగానీ రాకపోతే బాధపడటం చాలా తక్కువైపోయిందీ రోజుల్లో. ఎవరో సన్నిహితుల్ని జ్ఞాపకం పెట్టుకుంటున్నారుగాని తక్కిన వారిని భారత జనాభా క్రింద జమకట్టి వదిలి వేస్తున్నారు.

ఇటీవల ఇంటికోడళ్ళు కూడా లేకుండా రెండు, మూడు పెళ్ళిళ్ళు జరగడం విన్నాను. తక్కినవాళ్ళ సంగతి ఒక లెక్కా.

పూర్వకాలంలాగా బంధువులందర్నీ స్వయంగా పిలవాలంటే రెండు నెలలు ముందుగా 'భారతదేశమంతా తిరిగే సీజన్ టిక్కెట్టు ఒకటి కొనుక్కోవాలి. అప్పటికి పిలుపులు మాత్రం అవుతాయి.

పెళ్ళిళ్ళలో విందులు చెయ్యడం ఒక గొప్ప మర్యాద! విందులో ఏం చేశారు. ఎన్ని పిండివంటలు? మజ్జిగా, పెరుగా వేసవికాలమైతే మామిడి పళ్ళు వేశారా. ముక్కలు కోసివేశారా. ఇలాంటి ప్రశ్నలు అనేకం వేస్తూ వుంటారు. మామూలుగా ఇంటి దగ్గిర తీరని కోరికలన్నీ అక్కడ తీరాలన్నట్టుంటుంది కొందరి పని.

ఆరు పదార్థాలు చేసి వడ్డించినా అప్పడాలు, వడియాలు లేవనో, వున్నా సరిగా వడ్డన చెయ్యలేదనో, చెప్పినా మారుకనుక్కోలేదనో, ఏదో వంకలు పెట్టి పోట్లాడుతూ వుండేవారు. అసలీ విందుల మీద బోలెడు పాటలు పాడుతూ వుండేవారు.

వంకాయ కూరలో ఉప్పు లేదనో, పప్పు ఉడకలేదనో, మారు వడ్డించమంటే వదినగారు నడుం తిప్పుకుంటూ వెళ్ళిపోయిందనో – ఈ పాటలో చమత్కారాలు వొలకపోస్తూ వుండేవారు. ఇప్పటికి పెళ్ళిళ్ళలో ఒకపూట గ్రాండ్ డిన్నర్ ఏర్పాటు చేస్తున్నారు. కాలాన్ని బట్టి ఆలోచిస్తే అవికూడా అనవసరమనీ, చాలా భాగం వంటవేరు అవుతుందనీ అర్థం అవుతుంది.

ఇలాటి సమయాలలో ఏ బీదవాళ్ళకో విందుచేస్తే వాళ్ళకు ఎంతో ఆనందంగా వుంటుంది. జీవితంలో అనుభవించని రుచులు అన్నిటిని ఆయన జిహ్వారుచిని చూసి ఉప్పొంగిపోతాయి. వడ్డించిన ప్రతి వస్తువులూ వెయ్యిసార్లు కదుక్కుని తింటారు. వారి దోసిట్లో అమృతం పోసినంతగా ఆనందిస్తారు.

అలాంటి విందు లెక్కడ జరుగుతాయి. ఐశ్వర్యవంతులే ఆహ్వానించేది. వాళ్ళతో ఏదైనా పనివుంటేనే పిలిచేది. విందుల విస్తళ్ళలో పలుకుబడి చిందులు వెయ్యాలి. గృహస్థు మనస్సు పిల్లిమొగ్గలు వెయ్యాలి.

"ఇంతకన్నా తినలేం మొర్రో" అనే వాళ్ళను బ్రతిమాలి, "కొంచెం రుచి చూడండి. అలా వదిలి పెడితే ఎలా? పదార్థాలు బాగాలేవా? కొంచెం తినండి. ఈ రెండు జిలేబీ చుట్టలూ తిని, పాయసం తీసుకుందురు గాని, పోనీ బజ్జీలు

చల్లగా నంజుకొందురుగాని - పులిహోర మధ్యలో తినెయ్యవచ్చు. కొంచెం నిదానంగా కూర్చోండి" అని గృహస్థు బ్రతిమాలుతూనే వుంటాడు.

అతిథి ఆయాసపడుతూ "ఇక తినలేనండీ ఇక్కడితో వదలండి మీకు పుణ్యం వుంటుంది. నా ఆరోగ్యం మంచిది కాదు. తర్వాత బాధపడాలి" అని చెప్పినా వినరు.

"స్వీటు తింటే ఏమండీ ఏం చెయ్యదు. ఒక్కపూటలో ఏమీ చెయ్యవు." అని గృహస్థు బ్రతిమాలతాడు. ఒక ప్రక్కన ఎక్కడో కూర్చున్న ఒక పెద్ద మనిషి "బావగారూ మీరు తినకపోతే మేం మాత్రం తింటామా? మా చేతకూడా మానిపించాలనా మీ ఉద్దేశ్యం?" అని ఒక చమత్కారపు విసురు విసురుతాడు.

'ఆకలినిబట్టి తిండి' అని శాస్త్రం. 'తిండిని బట్టి ఆకలి' అనేది వుండదు. సామాన్యంగా తిండిపోతుల మాట అలా వుంచండి.

ఇలాటి విందులకు వెళ్ళినప్పుడు అలాటి బలవంతాలు వింటున్నప్పుడు అన్నానికి మొహం వాచిన వాళ్ళనేకమంది వున్నారు. వాళ్ళనిలా బ్రతిమాలే వాళ్ళెవరన్నా వున్నారా? అనిపిస్తుంది. ఒక్క జిలేబిచుట్ట నోటికందించి "తిను నాయనా?" అని వీపు నిమిరే వారెవరైనా వున్నారా? అనిపిస్తుంది.

అలాటి విందులకు వెళ్ళినప్పుడు తిండి లేక అలమటించే వారెందరో జ్ఞాపకం వస్తారు. విస్తట్లో ప్రతిపదార్థం స్వార్థాన్ని తలచి వెక్కిరిస్తున్నట్లనిపిస్తుంది. అందుకే కొందరు సామాన్యంగా విందులకే వెళ్ళరు.

Post your comments